# ఎల్బీనగర్‌లో కమలం హవా..

ఎల్బీనగర్, జూన్ 4: మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు భారీ మెజార్టీ లభించింది. పోలైన ఓట్లలో సింహభాగం బీజేపీకే దక్కడంలో ఈ ఒక్క సెగ్మెంట్‌లోనే సుమారు 1.03,588 ఓట్ల మెజార్టీని సొంతం చేసుకున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. మొత్తం 21 రౌండ్ల పాటు సాగిన కౌంటింగ్‌లో మొదటి రౌండ్ నుంచే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆధిక్యం స్పష్టంగా కనిపించింది. చివరి రౌండ్ వరకు బీజేపీ ఆధిక్యం పెరుగుతూనేపోయింది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సుమారు 28 వేల ఓట్ల మెజార్టీని సాధించడం ద్వారా రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికయ్యారు. అయితే తాజా ఎన్నికల్లో ఎల్బీనగర్ ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపి భారీ మెజార్టీని అందించారు. ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మెజార్టీ సాధిస్తే చాలు మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో విజయం ఖాయమనే మ్యాజిక్ ఈ ఎన్నికల్లోనూ ఫలించింది. ఇక్కడ లక్ష ఓట్ల మెజార్టీని సాధించడం ద్వారా మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందారు. ప్రధానంగా పోటీలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఏ దశలోనూ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు పోటీని ఇవ్వలేకపోయారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండో స్థానంలో ఉన్న బీజేపీ పార్లమెంటు ఎన్నికలకు వచ్చే సరికి గణనీయంగా ఓట్లను సాధించింది.

### 28 టేబుళ్లు.. 21 రౌండ్లలో కౌంటింగ్

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 6,04,763 మంది ఓటర్లకు గాను 46.27 శాతంతో మొత్తం 2,79,795 ఓట్లు పోలయ్యాయి. ఓట్లు వేసిన వారిలో పురుషులు 1,45,787 మంది కాగా, మహిళలు 1,33,977 మంది, ఇతరులు 31 మంది ఉన్నారు. ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కోసం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రెండు హాళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో హాల్‌లో 14 టేబుళ్ల చొప్పున మొత్తం 28 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పోలైన ఓట్లను 21 రౌండ్లలో లెక్కించి ఫలితాలు వెల్లడించారు. ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోలైన ఓట్లలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 1,71, 683 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి 68,095 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 33, 839 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా ఈటల రాజేందర్‌కు 1,03,588 ఓట్ల మెజార్టీని ఎల్బీనగర్‌లో సాధించారు.

### గల్లంతైన రేవంత్‌రెడ్డి సిట్టింగ్ సీటు

మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో ప్రశ్నించే గొంతుకగా గత పార్లమెంటు ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించారు. మల్కాజిగిరి ఎంపీగానే రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి దక్కడం ఆపై అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీఎంగా పదవి లభించింది. అయితే సీఎంగా పదవిలో ఉండి పార్లమెంటు ఎన్నికల బరిలో సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానంలో గల్లంతు అయ్యారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ ఉన్న మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానంతో పాటు తన సిట్టింగ్ పార్లమెంటు స్థానం మల్కాజిగిరిలో కాంగ్రెస్‌కు చుక్కెదురయ్యింది. మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో గత పార్లమెంటు స్థానంలో రేవంత్‌రెడ్డికి 28వేల మెజార్టీ లభించగా ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు, టీడీపీ నాయకులు, బీజేపీకి చెందిన ఓ కార్పొరేటర్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను కూడా పార్లమెంటు ఎన్నికల్లో దక్కించుకోలేకపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ మధుయాష్కీ గౌడ్ 83వేల ఓట్లను సాధించగా పార్లమెంటు ఎన్నికలకు వచ్చే సరికి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి కేవలం 68,095 ఓట్లకే పరిమితం కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అవక్కయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో 89 వేల ఓట్లను సాధించిన బీజేపీ మాత్రం ఒక్కసారిగా 1,71,683 ఓట్లను సాధించింది. పార్లమెంటు ఎన్నికలు కావడంతో బీఆర్ఎస్ పార్టీని కూడా ప్రజలు పెద్దగా ఆదరించలేదు. బీజేపీకి భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ క్రమంలో బీజేపీ పార్టీ శ్రేణుల్లో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరుస్తుండగా, పార్టీ చేరికల అనంతరం కూడా కాంగ్రెస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో లభించిన ఓట్లు కూడా దక్కక పోవడంతో వారంత ఒక్కసారిగా నిరాశలో మునిగిపోయారు.

**రౌండ్ల వారీగా పార్టీలకు లభించిన ఓట్లు**

| రౌండ్ నంబర్ | బీజేపీ | కాంగ్రెస్ | బీఆర్ఎస్ |
|---|---|---|---|
| 1. | 8,817 | 2,507 | 1,559 |
| 2. | 17,787 | 4,886 | 3,057 |
| 3. | 28,035 | 8, 046 | 4,930 |
| 4. | 38,803 | 11,871 | 7,498 |
| 5. | 46,872 | 16,571 | 9,125 |
| 6. | 54,581 | 19,760 | 10,981 |
| 7. | 62,183 | 23,058 | 12,742 |
| 8. | 70,656 | 28,355 | 15,059 |
| 9. | 79, 087 | 31,876 | 16,719 |
| 10. | 88,097 | 36,002 | 18,713 |
| 11. | 95,597 | 39,216 | 19,982 |
| 12. | 1,03,016 | 42,760 | 21,354 |
| 13. | 1,10,985 | 45,892 | 22,738 |
| 14. | 1,18,879 | 48,752 | 24,086 |
| 15. | 1,25,682 | 52,171 | 25,899 |
| 16. | 1,35,078 | 55,258 | 27,532 |
| 17. | 1,43,464 | 58,785 | 29,059 |
| 18. | 1,51,467 | 62,642 | 30,688 |
| 19. | 1, 59,598 | 64,874 | 31,862 |
| 20. | 1,68,482 | 67,322 | 33,330 |
| 21. | 1,71,683 | 68,095 | 33,839 |

## కాలనీల్లో అపరిచిత వ్యక్తుల సంచారం

**పట్టించుకోని పోలీసులు : నరేశ్ కాలనీ అధ్యక్షుడు**

బడంగ్‌పేట, జూన్ 4: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ శ్రీమారుతి నగర్‌లో కొన్ని రోజుల నుంచి అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నారని, ఇండ్లలో దొంగలు పడుతున్నారని మీర్‌పేట పోలీసులకు, 100కు ఫోన్ చేసినా స్పందన లేదని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేశ్ తెలిపారు. కొంత మంది చిన్న పిల్లలను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంటే కాలనీవాసులు వారిని గుర్తించి వెంబడించడం జరిగిందన్నారు. అదే రోజు పోలీసుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కాలనీవాసులు భయాందోళనకు లోనవుతున్నారన్నారు. ఇకనైనా పోలీసులు కాలనీల్లో నిఘా పెంచాలని విజ్ఞప్తి చేశారు.

## సీఐటీయూ ధర్నా

మాదన్నపేట, జూన్ 4: క్రీడా కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు శ్రావన్‌కుమార్ మాట్లాడుతూ.. సంతోష్‌నగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పని చేసే ఆకర్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, రామ్‌కుమార్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రభుదాస్

ఆర్కేపురం, జూన్ 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సరూర్‌నగర్ వీఎం హోం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వడ్డేపల్లి ప్రభుదాస్, కార్యదర్శిగా పి.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

## పార్కింగ్ చేసిన వాహనం మాయం

కాచిగూడ, జూన్ 4: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మా యమైన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మోతీలాల్‌నెహ్రూనగర్‌కు చెందిన బాలరాంచౌదరి ప్రైవేటు ఉద్యోగి. 1వ తేదీ రాత్రి ఇంటి ఎదుట ఏపీ 11 ఏజే 3530 నంబర్ ఆక్టీవాను పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు చూసేసరికి కనబడలేదు. మంగళవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో అతను ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.



మలక్‌పేట వైద్యశాలలో లతారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

## కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే బండారి

రామంతాపూర్, జూన్ 4 : బీఆర్ఎస్ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం అనారోగ్యంతో మలక్‌పేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు చెప్పాల లతారెడ్డిని ఆయన పరామర్శించారు. ఆరోగ్యం విషయంలో డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకుని మనోధైర్యం చెప్పారు. ఆరోగ్య పరంగా, పిల్లల చదువుల పరంగా ఎలాంటి అవసరం ఉన్నా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాయసం గోపాల్, అలిగ్జాండర్, సీహెచ్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన అసదుద్దీన్ ఒవైసీకి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి. – అబిడ్స్ / సుల్తాన్‌బజార్

అంబర్‌పేట డీఆర్‌సీ సెంటర్ నుంచి మజ్లిస్ పార్టీ కార్యకర్తలతో కలిసి బయటకు వస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

## మలక్‌పేటలో కొనసాగిన మజ్లిస్ పార్టీ హవా

సైదాబాద్, జూన్ 4 : పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో మలక్‌పేట నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ తన అధిపత్యాన్ని కొనసాగించింది. మజ్లిస్ పార్టీ, బీజేపీ మధ్య పోటీ ప్రధానంగా కనిపించినప్పటికీ మజ్లిస్ పార్టీ విజయం సాధించి తన సత్తాను మరోసారి నిరూపించుకుంది. ఎన్నికల ఫలితాల్లో రెండు, మూడు, నాలుగు, ఐదు రౌండ్లనుంచి ఎనిమిదో రౌండ్ వరకు బీజేపీ ఆధిక్యతను ప్రదర్శించినప్పటికీ ఆ తర్వాత అన్ని రౌండ్లలో చివరి వరకు మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ సమీప అభ్యర్థి మాధవీలతపై 31,390 ఓట్లతో నిర్ధిష్టమైన భారీ మెజార్టీతో ఒవైసీ విజయం సాధించారు. మలక్‌పేట నియోజకవర్గంలో 1,35,812 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోగా, మజ్లిస్ పార్టీకి 76,318, బీజేపీ అభ్యర్థి మాధవీలతకు 44,928, కాంగ్రెస్‌కు 9,660, బీఆర్ఎస్‌కు 3,089 ఓట్లు రాగా ఇతరులకు 1,817 ఓట్లు వచ్చాయి. మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ 31,390 ఓట్లతో మలక్‌పేటలో ఆధిక్యతను సాధించి గతం కంటే ఎక్కవ ఓట్లతో విజయం సాధించారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాల భాస్కర్**

చర్లపల్లి, జూన్ 4 : మేడ్చల్, మల్కాజిగిరి న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాల భాస్క ర్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ పోస్టర్‌ను మంగళవారం కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 8న జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమిన ల్, వాహన ప్రమాద, బ్యాంక్ రికవరీ, చెక్‌బౌన్స్, భూవివాదా ల కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నర్సింహారెడ్డి, దేవిడ్‌రాజుతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాల భాస్కర్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి కిరణ్‌కుమార్, తదతరులు

# అలరిస్తున్న ఇన్‌ఫాంట్ హ్యాండ్లూమ్ హాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్

మెహిదీపట్నం, జూన్ 4 : వేసవి సాయంత్రం వేళల్లో ప్రజలు ఆహ్లాదాన్ని పొందడానికి తమ ప్రాంతంలో చూడదగిన ప్రదేశాలకు వెళుతుంటారు. కొందరు ఎంటర్‌టైన్‌మెంట్ అందించే ప్రాంతాలకు వెళ్లాలని అనుకుంటారు. అలాంటి వారి కోసం కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ సంగం సమీపంలో ఇన్‌ఫాంట్ హ్యాండ్లూమ్ హాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు అయ్యింది.

### ఆకర్షణీయంగా.. ఆకట్టుకునేలా..

ఆకర్షణీయంగా రూపొందించిన ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటున్నది. అమెరికాలోని వైట్‌హౌస్ నమూనాతో రూపొందించిన ఈ ఎగ్జిబిషన్‌లోని జాయింట్ వీల్ ప్రజలకు ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తున్నది. ఆలోచింప చేసే విధంగా ప్రదర్శనల ఏర్పాటు పాటుగా.. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాబ్సన్ తెలిపారు. సందర్శకులకు పోటీలను నిర్వహించి బహుమతులు ఇస్తున్నామని పేర్కొన్నారు.

# సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పన

ముషీరాబాద్, జూన్ 4 : సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పనకు విద్యాశాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. విద్యా సంవత్సరం మొదలయ్యే నాటికి ముషీరాబాద్ మండలం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కలిపంచడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు ఆ దిశగా పనులు చేపడుతున్నారు.

### అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట సౌకర్యాల కల్పనకు శ్రీకారం..

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మన బస్తీ మన బడి కథకం ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించగా ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టింది.

### 22 పాఠశాలల ఎంపిక..

ముషీరాబాద్ మండలం పరిధిలోని 22 ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేశారు. ఐదు ఉన్నత పాఠశాలలు, 17 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం రూ. 1.6 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా తొలుత ఒక్కో పాఠశాలకు రూ.40 వేల చొప్పున విడుదల చేసిన అధికారులు బడుల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, బెంచీలు వంటి సౌకర్యాలు కల్పించే పనులను చేపడుతున్నారు.

### మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇందు కోసం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా ఎంపిక చేసిన 22 పాఠశాలల్లో వసతుల కల్పన కొనసాగుతున్నది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఇంజినీరింగ్ విభాగం అధికారుల సమన్వయంతో పనులు చేపడుతున్నాం.

– చిరంజీవి, డిప్యూటీ డీఈఓ, ముషీరాబాద్

మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఘనవిజయాన్ని హర్షిస్తూ మన్సూరాబాద్‌లో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి. – మన్సూరాబాద్, జూన్ 4

ఈటల రాజేందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, తదితరులు. – హయత్‌నగర్, జూన్ 4

ఈటల రాజేందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, బీజేపీ శ్రేణులు. – ఎల్బీనగర్, జూన్ 4

ఎస్కేడినగర్ చౌరస్తాలో సంబురాలు చేసుకుంటున్న బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బీజేపీ నేతలు. – వనస్థలిపురం, జూన్ 4

చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి విజయం సాధించడంతో నాదర్‌గుల్‌లో సంబురాలు జరుపుకొంటున్న బీజేపీ నేతలు అందెళ శ్రీరాములు, తదితరులు. – బడంగ్‌పేట, జూన్ 4

శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిపై కందుకూరులో పటాకులు కాలుస్తున్న బీజేపీ నేతలు. – కందుకూరు, జూన్ 4

## చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు

కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామిని దర్శించుకుని పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు కేంద్రానికి వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చంపాపేట, జూన్ 4: భువనగిరి పార్లమెంట్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కర్మన్‌ఘాట్ మాజీ ధర్మకర్త కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బసిగూడెం జంగారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు కేంద్రానికి వెళ్లటానికి ముందు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను ఆలయంలోకి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన స్వాములోరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బసిగూడెం జంగారెడ్డి, బసిగూడెం సోమనాథ్‌రెడ్డి, యాదగిరితో కలిసి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శాలువతో సత్కరించి సన్మానించారు. ధ్యానాంజనేయ స్వామి కృపతో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపొందినట్లు తెలిపారు.

## రైలెక్కుతుండగా జారిపడి యువకుడు మృతి

కాచిగూడ, జూన్ 4: రైలెక్కుతుండగా జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ ప రిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేటలోని వర్గల్ ప్రాంతానికి చెందిన కె.సంజీవ డెలివరీ బాయ్. సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్‌లో ఫలక్‌నుమా–సికింద్రాబాద్ ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి సంజీవ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.